సాక్షి
వికారాబాద్

మంగళవారం ౹ 12 ౹ డిసెంబర్ ౹ 2023



శిఖం భూమి కబ్జా

శిఖం భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు సత్యయ్య కోరారు. 8లో▸



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి

సీఎంను కలుద్దాం..

నిధులు తెద్దాం
- జెడ్పీ సభ్యుల తీర్మానం
- మహిళలు ఆర్థిక పురోగతి సాధించాలి
- గ్రామాల అభివృద్ధే జెడ్పీ ధ్యేయం
- స్థాయీ సంఘాల సమావేశాల్లో చైర్‌పర్సన్ సునీతారెడ్డి

అనంతగిరి: మహిళల ఆర్థిక స్వావలంబన కోసం కుటీర పరిశ్రమలు నెలకొల్పడానికి ముందుకు రావాలని జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి సూచించారు. సోమవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో జరిగిన స్థాయీ సంఘాల సమావేశాల్లో వివిధ శాఖలపై ఆమె జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. మనది సీఎం సొంత జిల్లా అయినందున అందరి చూపు ఈ జిల్లాపైనే ఉంటుందని, అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండి పని చేయాలన్నారు. అభివృద్ధి, సంక్షేమంలో అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయం చేసుకొని ఎక్కడి సమస్యలు అక్కడ పరిష్కారమయ్యేలా చూడాలని ఆదేశించారు. త్వరలో జెడ్పీటీసీలు, ఎంపీపీలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి జిల్లాకు నిధులు కేటాయించాలని కోరుదామని సభ్యులు తీర్మానించారు. జిల్లా సాధారణ సమావేశానికి కూడా ఆహ్వానించాలని సభ్యులందరు సునీతారెడ్డిని కోరారు. సీఎం జిల్లా కావడం వల్ల ఎమ్మెల్యేలను కలుపుకొని త్వరలోనే ముఖ్యమంత్రిని కలుద్దామని నిర్ణయించారు. అప్పటిలోగా జిల్లాలో శాఖల వారీగా అవసరమైన నిధులపై ప్రణాళికలు తయారు చేయాలని సునీతారెడ్డి సూచించారు. అనంతరం ఆర్థిక, ప్రణాళిక, గ్రామీణాభివృద్ధి, రహదారులు, విద్య, వైద్యం, గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్యం, జాతీయ ఉపాధి హామీ పథకం, విద్యుత్, గ్రామీణ అభివృద్ధి తదితర అంశాలపై సుదీర్ఘంగా సమీక్షించారు. ఏడు స్థాయీ సంఘాల సమావేశాలు ఆయా సంఘాల చైర్‌పర్సన్ల అధ్యక్షతన జరిగాయి. మెరుగైన వైద్య సేవలతో ప్రజల మన్ననలు పొందాలనున్నారు. జిల్లాలో ఇరిగేషన్ కింద తాండూరులో కాగ్నాపై ఐదు చెక్ డ్యాంల నిర్మాణం కోసం రూ.40 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. త్వరలో పనులు ప్రారంభించాలని సూచించారు. అలాగే జిల్లాలో పరిగి, వికారాబాద్, కొడంగల్ నియోజకవర్గాల్లో రుద్రారం, వికారాబాద్, కుల్కచర్ల, పరిగి, దోమ మండలాల్లో మంజూరైన విద్యుత్ సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు రెవెన్యూ అధికారులు వెంటనే భూములు కేటాయించాలని సూచించారు. వ్యక్తిగత మరుగుదొడ్ల కోసం ప్రజలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలు ఎక్కువగా జరిగేలా చూడాలని వైద్యాధికారులు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు నాణ్యమైన పోషకాహారం అందించాలని ఆదేశించారు. గర్భిణులు పోషకాహారం తీసుకునేలా సూచనలు ఇవ్వాలన్నారు. అంతకుముందు మహిళా శిశు, సాంఘిక సంక్షేమ శాఖలపై ఆ సంఘాల అధ్యక్షతన సమీక్ష చేశారు. సాంఘిక, గిరిజన సంక్షేమం, వెనుకబడిన తరగతులు, మైనారిటీ, యువజన సర్వీసులు, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ విభాగాల్లో అమలవుతున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలను సంబంధిత శాఖల అధికారులతో చర్చించారు. అనంతరం సునీతారెడ్డి మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను అమలు చేయాలన్నారు. రానున్న స్థాయీ సంఘాల సమావేశానికి వివిధ శాఖలకు చెందిన జిల్లాస్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. కార్యక్రమంలో వ్యవసాయ స్థాయీ సంఘం చైర్మన్ విజయ్ కుమార్, సాంఘిక సంక్షేమ స్థాయీ సంఘం చైర్ పర్సన్ అరుణదేశ్, మహిళా శిశు సంక్షేమ స్థాయీ సంఘం చైర్ పర్సన్ సుజాత, జెడ్పీ సీఈఓ జానకీ రెడ్డి, డిప్యూటీ సీఈఓ సుభాషిణి, జెడ్పీటీసీ సభ్యులు మహిపాల్, ధారాసింగ్, హరిప్రియ, నాగరాణి, సంతోష, శ్రీనివాస్ రెడ్డి, మంజుల, మేఘమాల, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఏబీవీపీ జిల్లా కన్వీనర్‌గా హరీష్‌రావు



అనంతగిరి: ఏబీవీపీ జిల్లా కన్వీనర్‌గా హరీష్‌రావును నియమించారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన అఖిల భారత విద్యార్థి పరిషత్ 69వ జాతీయ మహాసభల్లో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో విద్యార్థి సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తానని తెలిపారు.

అందుబాటులో ఉంటా ప్రజల సమస్యలు తీరుస్తా

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



ప్రజా సమస్యలపై చర్చిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: ప్రతి సోమవారం పట్టణంలోని ప్రజాభవన్‌లో అందుబాటులో ఉంటానని, సమస్యలు ఉన్నవారు తనకు నేరుగా అర్జీలు ఇవ్వొచ్చని ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికే ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం(ప్రజాభవన్)లో అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాభవన్ అనేది ఏ పార్టీకి సంబంధించినది కాదని, అన్ని పార్టీల నాయకులు, ప్రజలు ఇక్కడికి రావచ్చని తెలిపారు. అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి శక్తి వంచెన లేకుండా కృషి చేస్తామని అన్నారు. ఈ ప్రాంత అభివృద్ధిలో పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.

ఫార్మాసిటీ అక్రమాలపై విచారణ చేపడతాం

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసిన ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు

యాచారం: కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా ఫార్మాసిటీని రద్దు చేసి, అక్రమాలపై విచారణ చేపడతామని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో రైతులు సోమవారం ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫార్మాసిటీని అడ్డం పెట్టుకుని కొందరు అక్రమాలకు పాల్పడ్డారని, కొంత మంది అధికారులు ఆక్రమణదారులకు అండగా నిలిచారని ఆరోపించారు. భూసేకరణ, పరిహారం చెల్లింపుల్లో కోట్లాది రూపాయలు అక్రమాలు జరిగాయని, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో కుర్మిద్ద సర్పంచ్ బందె రాజశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు యాదయ్యచారి, ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్ శ్రీకాంత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ పద్ధతిలో పత్తి సాగు మేలు

హయత్‌నగర్: పత్తిని శాస్త్రీయ పద్ధతిలో సాగు చేయడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని, రైతులు దీనిపై దృష్టి పెట్టాలని పలువురు వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. హయత్‌నగర్‌లోని మెట్ట వ్యవసాయ పరిశోధనా సంస్థలో సోమవారం రైతులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్‌కే బిల్, క్రీడా డైరెక్టర్ ఎస్‌కే రవి, డీబీవీ రమణ, విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. రైతులు సరైన సమయంలో విత్తనాలు విత్తాలని, కలుపు నివారణకు తగిన సమయంలో చర్యలు తీసుకోవాలని, పురుగు మందులను సకాలంలో చల్లాలని సూచించారు. విత్తనాన్ని అధికారుల సూచన మేరకు తగిన ఎడంలో(దూరంలో) విత్తుకోవాలని అన్నారు. నీటి వనరులు ఉన్న రైతులు తగిన మోతాదులో నీటి తడులు ఇవ్వాలని, సస్యరక్షణ చర్యల్లో నిర్లక్ష్యం వహించరాదన్నారు. పత్తి సాగులో అధునాతన యంత్ర పరికరాలు అందుబాటులో ఉన్నాయని, శాస్త్ర వేత్తల సూచనల మేరకు యంత్రాలను వాడడం ద్వారా ఖర్చులను తగ్గించి అధిక లాభాలు పొందొచ్చన్నారు. నాగపూర్ పత్తి పరిశోధనా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు కేవీ రావు, శ్రీనివాస్, వెంకటేష్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



పంపిణీ సగమే!

చేప పిల్లల పంపిణీలో అధికారుల అలసత్వం
- జిల్లాలో మొత్తం చెరువులు 1,179
- చేపలు వదిలేందుకు ఎంపిక చేసినవి 847
- వదలాల్సిన చేప పిల్లలు 1.30కోట్లు
- ఇప్పటి వరకు వదిలింది 55లక్షలే

వికారాబాద్: వర్షాకాలం ముగుస్తున్నా ఇంకా ఉచిత చేప పిల్లల పంపిణీలో 50 శాతం లక్ష్యాన్ని కూడా చేరుకోలేదు. ఈ సారి జూలై మాసంలోనే చెరువులన్నీ నిండుకుండల్లా మారినా.. నేటికి చేప పిల్లలు వదిలే ప్రక్రియ పూర్తి చేయలేదు. వదులుతున్న చేప పిల్లలు సైతం నాణ్యత లేవని మత్స్య సహకార సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. మత్స్య శాఖ అధికారులు పంపిణీ దారులతో కుమ్మక్కు కావడంతోనే నాణ్యతను పట్టించుకోవటం లేదని వారు ఆరోపిస్తున్నారు. దీంతో మత్స్య సహకార సంఘాల సభ్యులు ఆంధ్రా ప్రాంతానికి వెళ్లి చేప పిల్లలు కొనుగోలు చేసి చెరువుల్లో వదులుకుంటున్నారు.

లక్ష్యానికి ఆమడు దూరంలో..

చెరువుల్లో చేప పిల్లలు వదిలే లక్ష్యానికి ప్రస్తుతం పంపిణీ చేస్తున్న దానికి ఏ మాత్రం పొంతన కుదరడం లేదు. వర్షాకాలం ముగిసినా సగం లక్ష్యాన్ని కూడా చేరుకోలేదు. జిల్లాలో మొత్తం 1,179 చెరువులు ఉండగా ఇందులో 847 చెరువుల్లో చేప పిల్లలు వదలాలని అధికారులు నిర్ణయించారు. ఈ ఏడు 1.30కోట్ల చేప పిల్లలు వదలాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ ఇప్పటి వరకు కేవలం 55లక్షల మాత్రమే వదిలారు. ప్రతి ఏటా ఆగస్టు, సెప్టెంబరు మాసాల్లో చెరువులు పూర్తి స్థాయిలో నిండేవి. ఈ సారి జూలై మాసంలోనే పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరుకున్నాయి. ఇన్నాళ్లు చేప పిల్లలు పంపిణీ చేస్తారని ఎదురు చూసిన మత్స్యకారులు ఆ ప్రక్రియ ప్రారంభం కాకపోవడంతో ఆంధ్రా ప్రాంతానికి వెళ్లి సొంత డబ్బులు వెచ్చించి కొనుగోలు చేసి తెచ్చుకుని చెరువుల్లో వదులుకుంటున్నారు.

నాసిరకం చేప పిల్లలు

ప్రభుత్వం వందశాతం రాయితీపై పంపిణీ చేసిన చేప పిల్లల్లో ఎక్కువ శాతం నాసిరకంగా ఉంటున్నాయి. సాధారణంగా చేప పిల్లలు చెరువుల్లో వదిలే సమయంలో మూడు నుంచి నాలుగు ఇంచులు ఉండాలి. కానీ ఎక్కడ చూసినా ఒక్క ఇంచుకు మించి ఉండటం లేదు. ఇటీవల దోమ మండల పరిధిలోని మోత్కూర్ చెరువులో చేప పిల్లలు వదిలేందుకు అధికారులు వచ్చారు. నాసిరకంగా ఉన్నాయని మత్స్యకారులు అధికారులతో గొడవ పడ్డారు. ఇలా ఇప్పటి వరకు నాలుగు సార్లు చేప పిల్లల్ని తిరిగి పంపేశారు. చెరువులో లక్ష చేప పిల్లల వదిలితే 50వేలు కూడా బతకడం లేదని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు నాణ్యమైన చేప పిల్లలను సకాలంలో పంపిణీ చేయాలని మత్స్యకారులు కోరుతున్నారు.

అయ్యోపాపం అభిలాష్‌రెడ్డి

- ఎదురెదురుగా బైక్‌లు ఢీ కొన్న ఘటనలో వాగ్వాదం
- మూకుమ్మడి దాడిలో బీటెక్ విద్యార్థి మృతి



అనంతగిరి: ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొన్న ఘటనలో.. బీటెక్ విద్యార్థిపై దాడిచేయగా దెబ్బలు తాళలేక మృతి చెందాడు. ఈ ఘటన వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ శ్రీను కథనం మేరకు.. మోమిన్‌పేట మండలం మల్‌రెడ్డిగూడేనికి చెందిన అభిలాష్‌రెడ్డి(22) బెంగళూర్‌లో బీటెక్ చదువుతున్నాడు. సెలవులు కావడంతో ఇటీవల స్వగ్రామానికి వచ్చాడు. ఆదివారం రాత్రి వికారాబాద్ నుంచి మల్‌రెడ్డిగూడెం వెళ్తున్నాడు. 8:40గంటలకు కొత్తగడి పెట్రోల్‌బంకు దాటిన త ర్వాత.. మోమిన్‌పేట మండలం గుడుపల్లికి చెందిన చాకలి ప్రవీణ్ తన భార్యతో కలిసి కొత్త స్పెండ్లర్ బైక్‌పై వికారాబాద్ వెళ్తున్నాడు. వేగంగా వచ్చి ఒక్కసారిగా అభిలాష్‌రెడ్డి స్కూటీని ఢీకొట్టగా ఇరువురికీ స్వల్ప గాయాలయ్యాయి. వాహనాలు సైతం దెబ్బతిన్నాయి. ఈ విషయంలో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో ప్రవీణ్ తమ్ముడు నరేష్ అతని స్నేహితులతో కలిసి ఘటన స్థలానికి చేరుకుని అభిలాష్‌పై దాడిచేశారు. తాను డబ్బులు ఇస్తానని చెప్పినా వినకుండా బండరాయితో అభిలాష్ ఛాతిపై కొట్టారు. తీవ్రగా యా ల పాలైన అతను స్పృహ కోల్పోవడంతో చికిత్స నిమిత్తం వికారాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు రిఫర్ చేశారు. మాదాపూర్‌లోని యశోద ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు అభిలాష్ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

మల్‌రెడ్డిగూడెంలో విషాదం

మోమిన్‌పేట: అభిలాష్‌రెడ్డి మృతితో మల్లారెడ్డిగూడెంలో విషాదం నెలకొంది. సోమవారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. చెట్టంత కొడుకు అకారణంగా మృత్యువాత పడటంతో తండ్రి పాడు రంగారెడ్డి, తల్లి శోభ రోదనలు మిన్నంటాయి. వీరి పెద్ద కుమారుడు రాకేశ్‌రెడ్డి ఆస్ట్రేలియాలో ఉద్యోగం చేస్తున్నాడు. కూతురు శిరీషారెడ్డి ఈనెల 19న అమెరికా వెళ్లేందుకు సిద్ధమవుతోంది. అభిలాష్‌రెడ్డి సైతం అమెరికా వెళ్లే ప్రయత్నాల్లో ఉండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది.

ఎన్నికలకు సిద్ధంగా ఉండండి

- ఎప్పుడైనా పంచాయతీ ఎలక్షన్‌కు నోటిఫికేషన్ రావొచ్చు
- కలెక్టర్ నారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: త్వరలో గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నందున అందుకు సమాయత్తం కావాలని కలెక్టర్ సీ నారాయణ రెడ్డి డీపీఓను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాలు, సూచనల మేరకు అధికారులు పని చేయాల్సి ఉంటుందన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వరి ధాన్యం, పత్తి కొనుగోలు చేయాలని ఆదేశించారు. రైతుల వద్ద పాసు పుస్తకాలు లేకపోతే వ్యవసాయ అధికారుల ధ్రువీకరణ పత్రాలు తీసుకొని ధాన్యం, పత్తి కొనుగోలు చేయాలన్నారు. మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు, హరిత హారంలో భాగంగా మొక్కల పెంపకం వంటివి చేపట్టాలన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న పనులు, మంజూరైన నిధుల వివరాలను కొత్తగా ఎన్నికైన శాసనసభ్యుల దృష్టికి తీసుకెళ్లాలని సీపీఓలకు సూచించారు. పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో జరుగుతున్న పనుల పురోగతిపై ఎమ్మెల్యేలకు సమాచారం ఇవ్వాలన్నారు. అభివృద్ధి పనులపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. జిల్లాలో అక్రమ మైనింగ్ జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వారిపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ధారూరు మెథడిస్టు జాతర ముగిసినందున పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సూచించారు. పరిగిలో నిర్వహించే ఇష్టమా కార్యక్రమానికి సంబంధించి పనులను మొదలు పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

ప్రజావాణిలో 105 ఫిర్యాదులు

ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారానికి ఆయా శాఖల అధికారులు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 105 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయా శాఖల అధికారులకు పంపి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్‌శర్మ, లింగ్యా నాయక్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ నారాయణ అమిత్ తదితరులు పాల్గొన్నారు.

'పీఏసీఎస్' యోగం ఎవరికో?

- కొత్త ప్రభుత్వంలో కొలువుదీరనున్న మార్కెట్ కమిటీ పాలకవర్గం
- ఏడేళ్లుగా బీఆర్ఎస్ నేతల చేతుల్లోనే మార్కెట్ పీఠం
- ఇకపై హస్తగతం కానున్న కమిటీలు
- ఆశలపల్లకిలో నేతలు



కుల్కచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

కుల్కచర్ల: కొత్త ప్రభుత్వం ఏర్పాటుతో క్షేత్రస్థాయి లో పనిచేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులకు కొత్తకొత్త ఆశలు చిగురిస్తున్నాయి. తమ పార్టీ అధికారంలోకి రావడంతో ఇకపై తమకు దక్కాల్సిన పదవులపై నేతలు దృష్టి సారిస్తున్నారు. ముఖ్యంగా మండల స్థాయిలో ఆపై గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, రైతు కమిటీల చైర్మన్లు తదితర ప్రోటోకాల్ పదవులను దక్కించుకునే అవకాశాల గురించి ఆలోచనలు మొదలు పెట్టినట్లు తెలుస్తోంది. తాము పదేళ్ల పాటు పార్టీ అభ్యున్నతి కోసం కష్టపడ్డామని తమకు ఏదైనా లబ్ధి చేకూర్చాలన్న వాదనను నియోజకవర్గ నాయకుల వద్ద వినిపించేందుకు సిద్ధమవుతున్నారు.

కొలువుదీరనున్న నూతన పాలకవర్గం

ఏడేళ్ల పాటు మార్కెట్ కమిటీలు బీఆర్ఎస్ నేతల చేతుల్లోనే కొనసాగాయి. ప్రస్తుత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో క్షేత్రస్థాయిలో సైతం మార్పులు జరగాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా నామినేటెడ్ పదవులతో కూడిన వ్యవసాయ మార్కెట్ కమిటీలను నూతనంగా ఏర్పాటు చేయాల్సిన సమయం ఆసన్నమైంది. దీంతో అందరూ ఇట్టి పదవులపై ఆశలు పెట్టుకున్నారు. స్థానిక నేతల వద్ద తమ ప్రస్తావనను తీసుకొస్తున్నారు. ముఖ్యంగా మార్కెట్ కమిటీలో 10మందితో కూడిన పాలకవర్గాన్ని నియోజకవర్గ ఎమ్మెల్యే సూచనలతో వ్యవసాయ శాఖ మంత్రి ఆధ్వర్యంలో నియామకాలు జరగనున్నాయి.

కమిటీ ఏర్పాటు ఇలా..

అన్నదాతలకు అనుబంధంగా ఉండే వ్యవసాయ మార్కెట్ కమిటీ ఎన్నిక అనేది అక్కడ ఉండే ఎమ్మెల్యే సూచనల ఆధారంగా కొనసాగుతుంది. మార్కెట్ కమిటీ పాలకవర్గంలో చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటు మార్కెట్ లైసెన్సు ఉన్న ఇద్దరు వ్యాపారులను డైరక్టర్లుగా నియమిస్తారు. మరో ఆరుగురు స్థానిక నేతలను డైరక్టర్లుగా ఎన్నుకుంటారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో మార్కెట్ కమిటీ పాలకవర్గాలన్నీ హస్తగతం కానున్నాయి. ముఖ్యంగా కుల్కచర్ల మండలంలో గత ఆగస్టు నుంచి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఖాళీగా ఉంది. ప్రస్తుతం ఈ పీఠాన్ని దక్కించుకునేందుకు నాయకులు ప్రయత్నాలు ప్రారంభించారు. మండల స్థాయిలో నామినేటెడ్ పోస్టులు కొన్ని మాత్రమే ఉండటంతో వాటిని దక్కించుకునేందుకు నేతలు తమ స్థాయిలో పైరవీలు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

ఎవరి ప్రయత్నాలు వారివి

కుల్కచర్ల పీఏసీఎస్ చైర్మన్ పదవిని దక్కించుకునేందుకు మొదటి వరుసలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు ఉండగా, బీసీ రిజర్వేషన్లలో జోగు వెంకటయ్య, కుమ్మరి స్వామి, పార్టీ చౌడాపూర్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటయ్య గౌడ్, ఎస్సీ సామాజిక వర్గంలో కనకం మొగులయ్య, తుప్పలి వెంకటేష్ ఉన్నారు. ఎస్టీ సామాజిక వర్గం నుంచి శివరాం నాయక్, విఠల్ నాయక్, గోపాల్ నాయక్, నర్సింహ నాయక్, జనరల్ స్థానం నుంచి భీంరెడ్డి, ఉమాపతిరెడ్డి వంటి వారి పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. మరి వీరిలో ఎవరిని మార్కెట్ పీఠం వరిస్తుందో మరికొన్ని రోజులు వేచి చూడాల్సి ఉంది.

రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతాం

- రేపు కొడంగల్ మున్సిపల్ జనరల్ బాడీ మీటింగ్
- అధికారులు విధిగా హాజరుకావాలి
- మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న జగదీశ్వర్‌రెడ్డి

కొడంగల్: అభివృద్ధిలో కొడంగల్ మున్సిపాలిటీని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామని చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో పట్టణం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుందన్నారు. ఈ నెల 14వ తేదీ ఉదయం 11గంటలకు మున్సిపల్ సర్వసభ్య సమావేశం ఉంటుందని తెలిపారు. పట్టణంలోని మంజునాథ బాంకెట్ హాల్‌లో సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అన్ని శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు. కొడంగల్‌లో చాలా పనులు అసంపూర్తిగా ఉన్నాయని, వాటిని పూర్తి చేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి అనేదానిపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. అలాగే భవిష్యత్తులో చేపట్టనున్న పనులపై చర్చిస్తామని వివరించారు. తెలంగాణలో కొడంగల్‌కు ప్రత్యేక గుర్తింపు వచ్చేలా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్ కుమార్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు మునీర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నోటీసులు జారీ



నోటీసులు అందజేస్తున్న కార్యదర్శి

కుల్కచర్ల: అనుమతులు లేకుండా ఇళ్ల నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కుల్కచర్ల పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో పర్మిషన్ లేని ఇళ్లు, షెడ్ల నిర్మాణాలు చేపట్టిన పలువురికి నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ నిబంధనలను పాటించి ఇళ్ల, షెడ్ల నిర్మాణాలకు అనుమతులు పొందాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కార్యకర్తల కృషి వెలకట్టలేనిది



ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డిని కలిసి నేతలు

కుల్కచర్ల: కాంగ్రెస్ పార్టీ గెలుపులో కార్యకర్తల కృషి వెలకట్టలేనిదని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల నాయకులు రామ్మోహన్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీ సాధించడంలో కార్యకర్తల కృషి ఎంతో గొప్పదని కొనియాడారు. కార్యకర్తలు ప్రజలందరికీ వారధిగా నిల్చుని ప్రభుత్వ వ్యతిరేక విధానాలను వివరించి పార్టీ అధికారంలోకి రావడానికి పని చేశారని చెప్పారు. కార్యకర్తలతో పాటుగా ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందేలా నిరంతరం పని చేస్తామని వివరించారు. కార్యక్రమంలో బ్లాక్ బి అధ్యక్షుడు కర్రె భరత్‌కుమార్, మాజీ ఏఎంసీ చైర్మన్ వెంకటేశ్, నాయకులు కనకం మొగులయ్య, జోగు వెంకటయ్య, సోషల్ మీడియా ఇన్‌చార్జి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఉపాధి జేఏసీ జిల్లా అధ్యక్షుడు



మంత్రిని కలిసిన నవీన్‌కుమార్

అనంతగిరి: ఇటీవల రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన సీతక్కను వికారాబాద్ జిల్లా ఉపాధి హామీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు బి.నవీన్‌కుమార్ మర్యాదపూర్వంగా హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మరింత ఉత్సాహంతో పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకువస్తామన్నారు.

గంజాయి పట్టివేత

ఇబ్రహీంపట్నం రూరల్: గంజాయి విక్రేతను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ కృష్ణయ్య వివరాల ప్రకారం.. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని బెంగుళూరు ఔటర్ సర్వీస్ రోడ్డులో శ్రీశ్రీ ఏరో సిటీలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్న అశుతోష్ చౌబే గంజాయి ఉందని సమాచారంతో పోలీసులు దాడి చేసి 200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

భార్య, పిల్లల పరిస్థితి విషమం

ఇబ్రహీంపట్నం: లారీ డ్రైవర్ నిర్లక్ష్యానికి కుటుంబ పెద్దను కోల్పోయి దుఃఖ సాగరంలో నిండిపోయారు. స్కార్పియో వాహనాన్ని లారీ ఢీకొట్టడంతో భర్త అక్కడికక్కడే మృతి చెందగా భార్య పరిస్థితి విషమంగా ఉన్న ఘటన ఆదివారం అర్ధరాత్రి ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్‌ఐ మైబెల్లి తెలిపిన వివరాల ప్రకారం.. మాడ్గుల మండలం పెద్ద మాడ్గుల్‌కు చెందిన కృష్ణారెడ్డి(47), అతని భార్య కృష్ణవేణి(42), కుమారుడు భార్గవ్‌రెడ్డి(21), కూతురు ఇందు(19) స్కార్పియో వాహనంలో ఉప్పల్ నుంచి స్వగ్రామానికి వెళ్తున్నారు. ఇబ్రహీంపట్నం గురుకుల విద్యాలయం వద్దకు రాగానే వెనుక వైపు నుంచి వేగంగా లారీ ఢీకొట్టింది. దీంతో వాహనం రోడ్డు పక్కకు వెళ్లిపోయింది. ఈ ఘటనలో తలకు గాయమైన కృష్ణారెడ్డి అక్కడికక్కడే ప్రాణాలు వదలగా, భార్య కృష్ణవేణికి తీవ్రగాయాలు కావడంతో పరిస్థితి విషమంగా మారింది. భార్గవ్‌రెడ్డి, ఇందులు తీవ్రగాయాలతో ఆస్పత్రికి తరలించి చికిత్సను అందిస్తున్నారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

‘ప్రజావాణి’ పరిష్కారం ఏదీ?

- వచ్చిన వారే మళ్లీ ఫిర్యాదులతో వస్తున్నారు..
- కలెక్టర్ ఆదేశించినా పట్టించుకోని అధికారులు
- కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారని ఆరోపణలు



ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకుంటున్న జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: ప్రజావాణిలో సమస్యలు పరిష్కారమవుతాయని ఎంతో ఆశతో కలెక్టర్ కార్యాలయానికి వస్తున్న ప్రజలకు నిరాశే ఎదురవుతుంది. ప్రతి సోమవారం వికారాబాద్ కలెక్టర్ ఆఫీస్‌లో నేరుగా ప్రజల నుంచి కలెక్టరే ఫిర్యాదులు తీసుకుంటున్నా సకాలంలో సమస్యలు పరిష్కారం కావడం లేదని బాధితులు వాపోతున్నారు. అసెంబ్లీ ఎన్నికల కారణంగా సుమారు రెండు నెలల పాటు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించలేదు. ఎన్నికల ప్రక్రియ పూర్తిగా ముగియడంతో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించారు. ప్రజల నుంచి ఫిర్యాదులను కలెక్టర్ నేరుగా స్వీకరించారు. ఇందులో అత్యధికంగా గత సమస్యలపై ఫిర్యాదులు ఇచ్చినవారే ఉన్నారు. ఫిర్యాదుల స్వీకరిస్తున్న కలెక్టర్ సంబంధిత అధికారులకు అప్పగించాక కిందిస్థాయిలో జాప్యం జరుగుతుందనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ పలుమార్లు తిరిగినా చిన్నచిన్న సమస్యలు కూడా పరిష్కరించడం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎక్కువ ఫిర్యాదుల్లో భూ సమస్యలు, ధరణి సమస్యలే ఎక్కువగా ఉండటం గమనార్హం.

పదిసార్లు దరఖాస్తు చేసుకున్నా..



నాది నవాబుపేట్ మండలం, కద్చర్ల గ్రామం. నాకు 62 ఏళ్లు ఉన్నాయి. ఆసరా పెన్షన్ కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ అనేక సార్లు తిరిగాను. పదిసార్లు దరఖాస్తు చేసుకున్న పట్టించుకోలేదు. దీంతో ప్రజావాణిలో కలెక్టర్‌ను కలిసి రెండు, మూడుసార్లు ఫిర్యాదు చేసినా రావడం లేదు. ఎందుకు ఇవ్వడం లేదో కూడా చెప్పడం లేదు. ఫిర్యాదు చేసినప్పుడు పెన్షన్ వస్తుందిపో అంటున్నారు. తరువాత మర్చిపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పెన్షన్ ఇచ్చేలా చూడాలి.

– పెంటయ్య, కద్చర్ల గ్రామం

పేరు తప్పుగా రాయడంతో..



నాది మున్సిపల్ పరిధిలోని మద్గుల్ చిట్టంపల్లి. మా పెద్దల ఆస్తి నుంచి నాకు మూడు ఎకరాల భూమి ఉంది. ఇప్పటి వరకు పాస్ బుక్కులు రాలేదు.. గత నాలుగైదేళ్లుగా పాస్ బుక్కుల కోసం తిరుగుతున్నా.. సమస్య పరిష్కారం కావడం లేదు. ధరణిలో నా పేరు తప్పుగా రాయడంతోనే పాస్ బుక్కు రావడం లేదని అధికారులు అంటున్నారు. ఇదే విషయంపై ప్రజావాణిలో కలెక్టర్‌కు సుమారు పదిహేను సార్లు ఫిర్యాదు చేశాను. సీసీఎల్‌కు పోయి కూడా అధికారులకు ఫిర్యాదు చేశాను. ఇన్నిసార్లు ఫిర్యాదు చేసినా నా పేరు సరిచేసి నా భూమికి పాస్ బుక్కులు ఇవ్వలేకపోతున్నారు.

– నజీర్, మద్గుల్ చిట్టంపల్లి

పేర్లు చేర్చడం లేదు



నాది పరిగి మండలం ఇబ్రహీంపూర్ గ్రామం. నేను నాలుగు ఏళ్లుగా పాత కలెక్టర్ కార్యాలయం ఉనప్పటి నుంచి ఫిర్యాదు చేస్తున్నా. రేషన్‌కార్డులో నా ఒక్కదాని పేరు మాత్ర మే ఉంది. దీంతో కేవలం 5కిలోల బియ్యమే వస్తున్నాయి. రేషన్ కార్డులో నా భర్త పేరు, నా పిల్లల పేర్లు చేర్చాలని చాలాసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. గతంలో ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే పేరు చేరుస్తామని చెప్పారు. ఏళ్లు గడుస్తున్నా చేర్చడం లేదు. నా పేరుమీద వచ్చే 5 కిలోల బియ్యంతో నలుగురం ఎలా బతకాలి. మరో సారి కలెక్టర్‌కు ఫిర్యాదు చేద్దామని ప్రజావాణికి వచ్చాను.

– విజయలక్ష్మి, ఇబ్రహీంపూర్

ఏం చెప్పడం లేదు..



నాది మున్సిపల్ పరిధిలోని కొత్రెపల్లి. నాకు 75శాతం అంగవైకల్యం ఉంది. రెండు ఏళ్ల వికలాంగుల పెన్షన్ ఇచ్చారు. ఎందుకో తెలియదు. నాలుగు నెలలుగా ఆపేశారు. ఇదేమిటని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. అంగవైకల్యం కారణంగా తిరగలేక పోతున్నా. గతంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా పెన్షన్ రావడం లేదు. మరోసారి కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే న్యాయం జరుగుతుందనే ఉద్దేశంతో వచ్చా. కలెక్టర్ చొరవ చూపి నాకు పెన్షన్ వచ్చేలా చూడాలని మారోమారు దరఖాస్తు చేసుకున్నా.

– చాకలి కృష్ణయ్య, కొత్రెపల్లి

పత్తి రైతులను ఇబ్బంది పెట్టొద్దు



పూడూరులో కాటన్‌మిల్‌లో పత్తిని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

పూడూరు: పత్తిని కొనుగోలు చేయడంలో రైతులను ఇబ్బంది పెట్టొదని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సీసీఐ అధికారులను ఆదేశించారు. సోమవారం మండలంలోని సాయిబాబా అగ్రిటెక్ జిన్నింగ్‌మిల్‌లో పత్తి కొనుగోలు ప్రక్రియను సంబంధిత అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. కొనుగోలు చేసిన రైతుల ఖాతాల్లో వెంటనే డబ్బులను జమ చేయాలని సూచించారు. జిల్లాలో తాండూరులో 3, పరిగిలో 3, వికారాబాద్‌లో 3, కోట్‌పల్లిలో 2, ధారూరులో 1, మర్పల్లిలో 1 చొప్పున మొత్తం 13 కొనుగోలు కేంద్రాల ద్వారా పత్తిని కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. కొనుగోలు కేంద్రం సిసిఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) ద్వారా ఇప్పటివరకు 1613 మంది రైతుల నుంచి 32,61,440 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశామని తెలిపారు. రైతులు పత్తిని కోసిన వెంటనే మిల్లులకు తరలించకుండా ముందుగా ఆరబెట్టి 8 శాతం తేమతో తెస్తే 7020 మద్దతు ధర వస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి సారంగపాణి, మార్కెట్ కమిటీ కార్యదర్శి ఫసియుద్దీన్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



తేమశాతం పరిశీలిస్తున్న అధికారులు

శిఖం భూమి కబ్జా



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సంఘం నేతలు

- వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు సత్యయ్య ఫిర్యాదు
- చర్యలు తీసుకోవాలని డిమాండ్

దోమ: శిఖం భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు సత్యయ్య డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ పురుషోత్తంకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని దిర్సంపల్లి గ్రామంలో సర్వే నంబర్ 47లో ఆరు ఎకరాల ఐదు గుంటల శిఖం భూమి గ్రామానికి చెందిన కనికిరెడ్డి బాల్‌రెడ్డి, కనికిరెడ్డి భగవంత్‌రెడ్డి అనే ఇద్దరు రైతులు అక్రమంగా కాస్తులో కొనసాగుతూ కబ్జాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఆ భూమి విషయమై గతంలో ఉన్న తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయగా, శిఖం భూమి సర్వే నిర్వహించి హద్దులను ఏర్పాటు చేయించి కబ్జా నుంచి విముక్తి కల్పించారని అన్నారు. మళ్లీ అదే రైతులు కబ్జాకు పాల్పడేందుకు యత్నిస్తున్నారని వాపోయారు. శిఖం భూమిలో ఉన్న కాలువలను జేసీబీతో పూడ్చివేస్తూ కబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వారిపై చర్యలు తీసుకుని శిఖం భూమి కాపాడాలని ఏమ్మార్వోకు విన్నవించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి రఘురాం, తదితరులు ఉన్నారు.

వంతెనలపై ఊడిన రెయిలింగ్

- ఆందోళనలో వాహనదారులు
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు



అన్నాసాగర్ బ్రిడ్జిపై కూలిన రేలింగ్

బంట్వారం: అధికారుల నిర్లక్ష్యం కారణంగా వంతెనలపై ఊడిన రెయిలింగ్ మరమ్మతులకు నోచుకోవడం లేదు. దీంతో రాత్రి వేళ వాహనదారులు ప్రమాదాల బారినపడే అవకాశం ఉంది. వివరాలలోకి వెళితే.. కోట్‌పల్లి మండల కేంద్రంలోని వాగుపై దాదాపు 40 ఏళ్ల కిందట బ్రిడ్జి నిర్మించారు. అదే సమయంలో అన్నాసాగర్ వాగుపైన కూడా వంతెన కట్టారు. కానీ, రెండు బ్రిడ్జిలకు ఇరు వైపులా అప్పట్లో వేసిన సైడ్ రేలింగ్ ప్రస్తుతం శిథిలావస్థకు చేరి ఎక్కడికక్కడ ఊడి పడుతోంది. సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు మాత్రం కనీస మరమ్మతులు కూడా చేపట్టడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అదుపు తప్పితే ప్రమాదమే

తాండూరు–సదాశివపేట రోడ్డు కావడంతో ఈ రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. సిమెంటు, నాపరాయి లోడింగ్ వాహనాలు వందల సంఖ్యలో నేషనల్ హైవేకు చేరేందుకు ఇటుగానే వెళ్తుంటాయి. ఇతర వాహనాలు లెక్కకు మించి తిరుగుతాయి. కోట్‌పల్లి ప్రాజెక్టుకు టూరిస్టులు ఇదే దారిలో కార్లు, మోటారు బైకులపై అతివేగంగా ప్రయాణిస్తారు. వంతెనల వద్ద వాహనాలు అదుపు తప్పితే రక్షణగా నిలిచేందుకే ఇరువైపులా సైడ్ రెయిలింగ్ నిర్మిస్తారు. కోట్‌పల్లి , అన్నాసాగర్ బ్రిడ్జిలు నిర్మించి దశాబ్దాలు కావడంతో శిథిలావస్థలకు చేరి సైడ్ వాల్స్ కూలుతున్నాయి. అన్నాసాగర్ వంతెనపై రేలింగ్ ఎక్కడికక్కడ ఊడిపడగా , కోట్‌పల్లి బ్రిడ్జిపై సైడ్‌వాల్స్ పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. ద్విచక్ర వాహనదారులు రాత్రి వేళ అటుగా ప్రయాణించాలంటేనే జంకుతున్నారు. అదుపు తప్పితే వాగులో పడాల్సిందేనని ఆందోళన చెందుతున్నారు. అధికారులు ప్రమాదం జరిగితేగాని పట్టించుకునేలా లేరని వాహనదారులు వాపోతున్నారు.

కొత్తగా నిర్మిస్తాం

కోట్‌పల్లి ,అన్నాసాగర్ వంతెనలపై కొత్తగా రెయిలింగ్ నిర్మిస్తాం. వీటికి సంబంధించి రూ. 50 లక్షలకు ఎస్టిమేషన్ వేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపా ం. నిధులు మంజూరు కాగానే పనులు చేయిస్తాం. – శ్రీనివాస్ డీఈ ఆర్‌అండ్‌బీ

గుర్తు తెలియని వాహనం ఢీ



ట్రాన్స్‌ఫార్మర్‌పై పడిన విద్యుత్ స్తంభాలు



వ్యవసాయ పొలంలో విరిగి పడిన విద్యుత్ స్తంభాలు

- విరిగిన విద్యుత్ స్తంభాలు
- 25 హెచ్‌పీ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం

పెద్దేముల్: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఐదు విద్యుత్ స్తంభాలు విరగడంతో పాటు రెండు 25 హెచ్‌పీ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమైన సంఘటన పెద్దేముల్ మండలంలో సోమవారం ఆలస్యంగా వెలుగు చూసింది. పెద్దేముల్ ఇన్‌చార్జి ఏఈ సందిప్, ఆత్కూర్ సర్పంచ్ భర్త శాంతప్ప తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దేముల్ మండల ఆత్కూర్ గ్రామ సమీపంలో శివాలయం వద్ద గ్రామానికి కిలో మీటరు దూరంలో తాండూరు–జహీరాబాద్ ప్రధాన రహదారిపై ఉన్న విద్యుత్ స్తంభాల ద్వారా ఏజీఎల్, వాటర్ సప్లయ్‌కు విద్యుత్ సరఫరా అవుతుంది. ఈ నెల 8వ తేదీ మధ్యాహ్నం సుమారు 3గంటల సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఐదు విద్యుత్ స్తంభాలు విరగడంతో పాటు రెండు 25హెచ్‌పీ ట్రాన్స్‌ఫార్మర్లపై స్తంభాలు పడి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో వాటర్ సప్లయ్, రైతులకు కరెంటు సరఫరా నిలిచిపోయింది. రెండు రోజుల తరువాత వాటర్ సప్లయికి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఏజీఎల్‌కు మాత్రం పూర్తిగా విద్యుత్ సరఫరా నిలచిపోయింది. ఈ ప్రమాదంతో సుమారు రూ.లక్షకు పైగా నష్టం వాటిల్లిందని విద్యుత్ అధికారులు తెలిపారు. రెండు రోజుల్లో కొత్త స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా చేస్తామని ఇన్‌చార్జి ఏఈ సందిప్ వెల్లడించారు. మండలంలో రెండేళ్ల నుంచి పర్మినెంట్ ఏఈ లేక, ఉన్న ఏఈలు పది రోజులకు ఒకసారి రావడంతో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు అంటున్నారు. ఈ విషయమై తాండూరు ఏడీ ఆదినారాయణను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు. త్వరగా విద్యుత్ సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

బైక్ అదుపుతప్పి ఒకరి దుర్మరణం

ఆమనగల్లు సమీపంలో ఘటన

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణ సమీపంలోని షాద్‌నగర్ రోడ్డులో ఆదివారం రాత్రి బైక్ అదుపుతప్పి కిందపడటంతో ఓ వ్యక్తి దుర్మరణం చెందారు. దీనికి సంబంధించి ఆమనగల్లు ఎస్‌ఐ బాల్‌రాం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తలకొండపల్లి మండలం కర్కాస్‌తండాకు చెందిన కేతావత్ గోపాల్(43) మోటార్ బైక్‌పై ఆదివారం మధ్యాహ్నం ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని విఠాయిపల్లిలో బంధువుల ఎంగేజ్‌మెంట్‌కు వచ్చారు. అనంతరం రాత్రి స్వగ్రామానికి వెళుతుండగా పట్టణ సమీపంలో రైస్‌మిల్లు మూలమలుపు వద్ద అదుపుతప్పి కింద పడటంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందారు. దీనిపై మృతుని భార్య కేతావత్ చిట్టి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బాల్‌రాం తెలిపారు.

హైనా దాడిలో దూడ మృతి

భయందోళనలో గ్రామస్తులు

నందిగామ: హైనా దాడిలో గేదె దూడ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని తాటిగడ్డతండాలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. అటవీ సెక్షన్ అధికారి రవీందర్, బీట్ అధికారి అజీజ్ కథనం ప్రకారం.. తండా సమీపంలోని నేనావత్ గోవింద్ ఆదివారం సాయంత్రం పశువులను పాకలో కట్టేసి ఇంటికి వెళ్లిపోయాడు. సోమవారం ఉదయం వచ్చి చూసే సరికి ఓ దూడను గుర్తు తెలియని క్రూరమృగం తిని వెళ్లిపోయిందని గ్రామస్తులకు తెలిపాడు. దీంతో తోటి రైతులు ఘటనాస్థలానికి చేరుకొని పులి దాడి చేయడంతోనే దూడ మృతి చెందిందని భయాందోళనలకు గురయ్యారు. సమాచారాన్ని అటవీ అధికారులకు తెలియజేయడంతో సెక్షన్ ఆఫీసర్ రవీందర్ సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. దాడి చేసింది పులి కాదు.. హైనా అని వారు స్పష్టం చేశారు.

క్షతగాత్రుడికి పరామర్శ

నందిగామ: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి శంషాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడిని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పరామర్శించారు. మండల పరిధిలోని వీర్లపల్లికి చెందిన ఇటుకపల్లి శ్రీకాంత్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఈ నేపథ్యంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ విషయం తెలుసుకొని క్షతగాత్రుడిని పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో నర్సింహా, గ్రామస్తులు ఉన్నారు.

పల్లాకు సన్మానం

మొయినాబాద్ రూరల్: ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని అఖిల భారతయాదవ సంఘం రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ముదిగొండ రవియాదవ్ ఘనంగా సన్మానించారు. విద్యాజ్యోతి ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్‌గా రాజేశ్వర్‌రెడ్డి ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారని కొనియాడారు. అనంతరం రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలు తీర్పు ఏది ఇస్తే అదే జరుగుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో షాబాద్ గిరి, అశోక్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.



అక్రమ నిర్మాణాల కూల్చివేత



జంగంకుంటలో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న అధికారులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం మండలంలోని ఎంపీ పటేల్‌గూడలో ఓ రియల్టర్ ప్రభుత్వ భూమిని కబ్జా చేసి అపార్ట్‌మెంట్ నిర్మిస్తున్నాడని గ్రామస్తుల ఫిర్యాదుతో అధికారులు చర్యలు తీసుకున్నారు. సోమవారం ఎంపీపటేల్‌గూడ రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూమిలో అపార్ట్‌మెంట్ నిర్మిస్తుండగా సంబంధిత అధికారులు పరిశీలించారు. రెవెన్యూ సిబ్బంది సర్వే నిర్వహించారు. జంగంకుంటను కబ్జా చేశారని నిర్ధారించారు. ఆరు గుంటలకు పైగా ఆక్రమణకు గురైనట్లు తెలిపారు. ఎఫ్‌టీఎల్‌లో నిర్మించిన వాటిని అధికారులు కూలిచ్చేశారు. పనులు నిలిపివేయాలని తహసీల్దార్ రియల్టర్లకు చెప్పినా కనీసం పెడచెవిన పెట్టలేదు. పోలీసులకు సమాచారం ఇచ్చి పనులు నిలిపివేయాలని తెలిపారు. దీంతో ఆక్రమణదారులు అధికారులపై చిందులేశారు. గ్రామస్తులు వచ్చి పనులు నిలిపివేయాలని ప్రభుత్వ భూమిని కాపాడాలని అధికారులను కోరగా సర్వే పూర్తి స్థాయిలో చేస్తామని హామీ ఇచ్చారు. తాత్కాలికంగా పనులు నిలిపివేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐ కృష్ణ, ఇరిగేషన్ డీఈ ఉషా, ఏఈ రాజ్యలక్ష్మి, టీపీఓ అబీబ్‌ఉన్నీసా, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆధార్.. ఏమిటీ బేజార్!

- ఒకే అప్‌డేట్ కేంద్రం ఉండటంతో ఇబ్బందులు
- పడిగాపులు కాస్తున్న స్థానికులు



చేవెళ్ల మండల కేంద్రంలో ఆధార్ కేంద్రం వద్ద గుమిగూడిన ప్రజలు

చేవెళ్ల: గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అన్ని పథకాలకు ఆధార్ కార్డు తప్పనిసరి అనడంతో నిత్యం కేంద్రాల వద్ద ప్రజలు పడిగాపులు కాశారు. ప్రస్తుతం సైతం అవే ఇబ్బందులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. చేవెళ్ల మండల కేంద్రంలో నియోజకవర్గానికి సంబంధించి ఒక్కటే ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయటంతో నిత్యం అన్ని మండలాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు వస్తున్నారు. సోమవారం కూడా చేవెళ్లలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ వద్ద ఉన్న ఆధార్ కేంద్రం దగ్గర ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆధార్ అప్‌డేట్, మార్పులు చేర్పులకు సంబంధించి విపరీతంగా జనాలు తరలివచ్చారు. సాయంత్రం వరకు ఉన్నా చాలా మందికి ఆధార్ అప్‌డేట్ పనులు కాకపోగా సమయం అయిపోయిందని రేపు రావాలని సిబ్బంది చెప్పారు. ఇలా ప్రతిరోజు జరుగుతూనే ఉందని ప్రజలు వాపోతున్నారు. వృద్ధులు, వికలాంగులు, చిన్నపిల్లలను ఎత్తుకొని మహిళలు, విద్యార్థులు ఆధార్ కేంద్రం వద్ద పడిగాపులు కాశారు. ప్రతి రోజు కొంత మందికే ఆధార్ అప్‌డేట్ అవుతుండటంతో మిగతావారు రోజూ వచ్చి వెళ్లిపోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో ఎన్నిసార్లు ప్రజలు మండలాల వారీగా ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరినా ఏ అధికారి స్పందించలేదని వాపోతున్నారు. ఇప్పుడు కొత్త ప్రభుత్వం వచ్చిందని ఇప్పుడైనా ప్రజల సమస్యలు పట్టించుకుంటారా లేదా అవే ఇబ్బందులు పడాలా అని ప్రశ్నిస్తున్నారు. కనీసం కాంగ్రెస్ ప్రభుత్వం అయినా స్పందించి అధికారులకు ఆదేశాలు ఇచ్చి ఈ ఆధార్ కేంద్రాలను మండలాల వారీగా ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు.